కథ

# జీవన గీతం

ఎన్. అనూరాధ



హేమంతం గడ్డకట్టించేలా లేకపోయినా ఒక చిరుచలి అనుభవాన్నిస్తోంది. సాయంకాలం ఏడున్నర అవుతూంది. ఎంత త్వరగా ఇంటికి వద్దామన్నా పని ఒత్తిడి రానీయదు.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర... జనం, జనం! ఓ ప్రవాహంలా జనం! ఆ అరక్షణం పాటు ఉక్కిరిబిక్కిరి అనిపిస్తుంది. ఆ హడావుడి వాతావరణం తనకిప్పుడు చాలా కావాలనిపిస్తోంది. ఒకప్పుడు జనాన్ని భరించలేని తనం ఉండేది. నిశ్శబ్దాన్ని ఆస్వాదించే ఆ రోజులు...

స్కూల్‌డేస్, కాలేజ్‌డేస్... కేరింతలు కొట్టే క్లాస్‌మేట్స్ మధ్య ఎప్పుడో అరుదుగా మాత్రమే కల్సే స్వభావం. ఇంటికొస్తే పుస్తకాల మధ్య...

అమ్మ విసుక్కుంటూనే ఉండేది.

"సునీ! ఇంట్లో ఇందరం ఉన్నా ఎవరితోనూ కలవకపోతే ఎలాగే?" అంటూ. అన్నయ్య ఊర్కునేవాడుకాదు.

"గంటలు, గంటలు అలా నీగదిలో ఏంచేస్తుంటావు? కారమ్స్ ఆడుతున్నాం. వచ్చి జాయినవు" బలవంతంగా వెళ్ళికూర్చున్నా తనకసలు ఆసక్తే ఉండేది కాదు. ఎందుకో, ఏమో! పుస్తకాలు మాత్రమే ఆప్తబంధువుల్లా తోచేవి.

ఆదివారాలు తలంటిపోసిన జుట్టు చిక్కుతీస్తూ అమ్మ ఏవో కబుర్లు చెబుతుండేది. తను చేతిలో బుక్‌తో 'ఊఁ' కొడుతుండేది. జడ అల్లడం పూర్తి అవుతూనే అమ్మఒడిలోకి జారి పుస్తకంలో పూర్తిగా మునిగిపోయేది. తన ధోరణి చూసి, చూసి అమ్మా "సునీ! పుస్తకం ఉండాల్సిందేనా చేతిలో?" ఆప్యాయంగా విసుక్కునేది.

ఇంటికి చేరడం కూడా గమనించనేలేదు. తను ఆలోచనలమధ్య. ఇంటితాళం తీస్తుంటే స్ట్రైక్ అయింది. అవును, సందీప్ నిన్నరాత్రి వెళ్ళిపోయాడు కదూ. ఇల్లంతా ఖాళీ ఖాళీ. ఇంటికొస్తే ఈ ఖాళీతనం భరించాలి.

త్వరగా ఇంటికి రావడం ఎందుకు? ఎవరికోసం? ఒక నిస్సత్తువ ఆమెలో. చిత్రంగా జీవితంలో ఇదివరకెన్నడూ ఆలోచనల్లోకి రానిభావన. ఒంటరితనం! రవి ఆఫీసులో బిజీగా ఉంటున్నాడు. రాత్రి ఎటూ పొద్దుపోతూంది. ఏం వండినా పట్టించుకునే స్థితిలో ఉండడు. కంప్యూటర్ ముందు ఓ గంట రెండు గంటలు .. ఇంతలో కళ్ళు కూరుకుపోయే నిద్ర. తెలవారి అటెండవ్వాల్సిన పనులు.

మంచం మీద వాలుతూనే "సునీ! ఈ ఆదివారం ఎక్స్‌క్లూజివ్‌గా నీకోసమే" అంటూ పసివాడిలా నిద్రలోకి జారుకుంటాడు.

అంత స్వచ్ఛంగా హాయిగా ఏ చీకూ, చింతా లేనట్లు ఎలా నిద్రపోతాడో! ఆమెకి ముచ్చటేస్తుంది.

ఈ నిద్రలేని రాత్రులు, ఈ నిరాశ, నిట్టూర్పులు ఇవన్నీ తనని క్రొత్తగా వేధిస్తున్నాయి. అంతప్రియంగా ఉండే పుస్తకాలు కూడా ఓదార్పునివ్వలేక పోతున్నాయి.

ఆఫీసుపని, పిల్లల చదువులు... ఒక్కక్షణం తనకంటూ మిగలడంలేదన్న ఉక్రోషం! పిల్లల హోంవర్క్ పూర్తి అవుతూనే వాళ్ళని దూరంగా తరిమేసేది. ఊపిరాడదని పనులతో సతమతమయ్యే రవిమీద అలకగా ఉండేది.

కాని పోటీ ప్రపంచంలో అతని జాబ్‌కున్న రిస్క్, ఒక్కక్షణం నిలబడిపోయినా కొన్నివేల మైళ్ళ దూరానికి విసిరి వేయబడతాడని తెల్సు. రాజీపడుతుంది, తప్పదు.

తన జీవితం తనది కాకుండా ఎటో వెళ్ళిపోతోందోనన్న కసి. ప్రపంచంతో కల్సి నడవడం చేతకాని నిస్సహాయత! తన తోడ బుట్టిన

వాళ్ళ దృష్టిలో తనొక్తి అమాయకురాలు.

పిల్లలు పెద్దవుతున్నకొద్దీ తను ఎదుర్కోవలసిన ఛాలెంజెస్ మరింత పెరుగుతూనే ఉన్నాయి.

పిల్లలకోసం అనుక్షణం అలర్ట్‌గా ఉండాలి. కాని బాధ్యతగా ఏదీ చెప్పకూడదు. చెప్పినా నచ్చదు. చెప్పకుండా చేస్కునే చురుకుదనం తనకెన్నడూ కన్పించేదే కాదు.

కాని ఇప్పుడాలోచిస్తే అన్పిస్తోంది. తన కంటికి ఏమీ చేతకాని వాళ్ళల్లా కన్పించినా ఎక్కడా, ఏనాడూ చదువులో కాని, ఏ విషయంలోనూ కాని వెనుకబడిన సందర్భాలే లేవు. తనెందుకంతగా వాళ్ళువేసే ప్రతి అడుగూ అంత పర్‌ఫెక్ట్‌గా మాత్రమే ఉండాలని కోరుకునేది!

శెలవులకి పిల్లలతో స్వంత ఊరువెళ్తే "అమ్మమ్మా! అమ్మ మమ్మల్ని అస్సలు వినదు. ఒక్కరోజూ మాతో కూర్చుని కబుర్లు చెప్పదు" తన ఎదుటే పిల్లల కంప్లెయింట్లు మౌనంగా వినేది.

తన స్వభావం అమ్మకి కొత్త కనుకనా? "చిన్నప్పుడూ అంతేనమ్రా ఎవరితోనూ కల్సేదికాదు. అదీ, దాని బుక్సూ అంతే దాని లోకం తాతయ్య పోలికే వచ్చింది అమ్మకి." ఆపేక్షగా కూతుర్ని వెనకేసుకొచ్చే దావిడ.

ఫోన్ రింగవడంతో ఒక్కసారి ఉలిక్కిపడింది సునీత. "సునీ! నేను వచ్చేసరికి లేటయ్యేలా ఉంది. ఇక్కడొక ప్రోబ్లమ్ వచ్చింది. నువ్వు భోజనం చేసెయ్. నేనిక్కడ ఏదో తింటాలే", సమాధానం కోసం చూడకుండా 'బై' చెప్పేశాడు.

బాల్కనీలో సన్నజాజి తీగె దగ్గరగా కుర్చీలాక్కొని కూర్చుంది. నిన్న మొన్నటిదాకా పచ్చదనంతో వెల్లువెత్తిన చిగుళ్ళు, నేటికి మొగ్గల్ని తొడిగి, పందిరంతా పరిమళమై అల్లుకుంది. ఆ చిగుళ్ళూ, మొగ్గలు పరిమళాలు అన్నింటినీ నిత్యం చూస్తూనే ఉంటుంది. అయినా ఎప్పటికప్పుడూ కొత్త అనుభవమే ఆమెకి.

పువ్వుల్ని రాల్చిన రెమ్మలు ఒక్కక్షణం అలవోకగా నిలబడినట్లుంటాయి. స్తబ్దతని అంతలోనే ఎటు విదిల్చి వేస్తాయో ఆ ఎండిన రెమ్మల నంటి చిగుళ్ళు ప్రారంభం అవుతాయి.

స్వప్న పెళ్ళై వెళ్ళిపోయింది. చైతన్యాన్ని పోగుచేసినట్లున్న స్వప్న ఇంట్లో సందడంతా పట్టుకు వెళ్ళిపోయింది, ఎక్కడో ఖండాల కావలగా, చదువు పేరుతో సందీప్ వెళ్ళిపోయాడు. తనిక డిసిప్లిన్ అంటూ వాళ్ళ వెంట పడాల్సిన అవసరం లేదు. హాయిగా పుస్తకం చదువుకునే అదృష్టం లేదని నిట్టూర్చే అవసరమూ లేదు.

ఇక ఆపుకోలేకపోయింది. చివ్వున కన్నీరు ప్రవాహమైంది. ఒంటరితనంకోసం తహతహ లాడేది. బాధ్యతల మధ్య ఊపిరాడనట్లు ఫీల్ అయ్యేది. కాని ఇప్పుడు... చుట్టూ ఆవరించిన స్తబ్దత. చైతన్యమంతా నిన్నల్లోకి ఒదిగి మాయమైపోయింది.

ఒకసారి ఇంటికొచ్చి ఫ్రెండ్స్‌తో స్వప్న చెప్పడం జ్ఞాపకం వచ్చింది.

"మాకు కావలసినదేదైనా అమర్చేది అమ్మే. కాని అమ్మంటే డిసిప్లిన్. అంతే, నాన్న అంటే బోల్డు ఇష్టం."

మనస్సు చివుక్కుమంది. నా జీవితం, నా అభిరుచులు అన్నీ వదులుకుని ఈ పిల్లలకోసం పడే తాపత్రయం నాకేం మిగులుస్తుందన్న దుఃఖం.

రెండు సంవత్సరాల క్రితం స్వప్న హాస్టల్‌లోఉన్న తన ఫ్రెండ్ దీపతో కల్సి వాళ్ళ ఊరెళ్ళింది. ఓ వారం శెలవులు గడిపేందుకు.

వస్తూనే తన మెడచుట్టూ చేతులేసి, "అమ్మా! నువ్వు అందరు అమ్మల్లా ఉండు. హాయిగా మా దీప వాళ్ళ అమ్మ అయితే మాతోపాటు టి.వి. చూస్తుంది. మాతో సినిమాలకి వచ్చేది. రాత్రుళ్ళు ప్రొద్దుపోయేవరకు బోల్డు కబుర్లు చెప్పేది మాతో. నువ్వూ అలాఉండమ్మా."

కాని స్వప్నలేని వారంరోజులు తనెంత అన్యమనస్కంగా గడిపిందో తనకి బాగా జ్ఞాపకం, ఎందుకా? అపురూపంగా పెంచుకున్న తన చిన్నిని దానికెంత సరదా అయితే మాత్రం ఎక్కడికో ఎందుకు పంపాలి? ఇవే ఆలోచనలు ఆవారం రోజులు. ఇవేవీ తను స్వప్నతో ఏనాడు చెప్పలేదు.


పిల్లలు అల్లరి చెయ్యాలి అంటే తనెప్పుడూ ఒప్పుకునేదే కాదు. తన పిల్లలు ఆదర్శంగా పెరగాలి. అంతే.

"సునీ! పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళతో స్నేహంగా ఉండు. వాళ్ళ మనసులు విను. నిన్ను మిస్సవుతున్నారు వాళ్ళు చదువులనో, ఉద్యోగాలనో దూరంగా వెళ్ళిపోతారు. స్వప్న పెళ్ళి అయ్యాక ఎక్కడుంటుందో, ఎంత దూరం వెళ్ళిపోతుందో" రవి మాటలు ఒక్కోసారి ఉలిక్కిపడేలా చేసేవి.

ఈ పిల్లలు వాళ్ళ జీవితాల్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయే రోజులు అప్పుడే వచ్చేశాయె?

తన పెళ్ళి, రవితో తన జీవితం నిన్న మొన్న మొదలైనట్లుంది. ఆలోచనలు ఎన్నో రాత్రులు నిద్రని దూరం చేసేవి. ప్రాణంగా చూసుకునే పుస్తకాలూ చేదైపోయాయి.

ఈ పిల్లల్ని ఎక్కడికో పంపాల్సి ఉంటుందన్న ఆలోచనే ఇన్నాళ్ళూ రాలేదే?! విచిత్రం! పసిపిల్లల్లా ఇంకా తన వెనుకే తిరుగుతూ, విసిగిస్తూ,



చీవాట్లు తింటూ అలాగే ఉన్నారని, ఉంటారని తనెంత అమాయకంగా ఆలోచించింది! ఇది అమాయకత్వమా? అహంకారమా?

స్వప్న పెళ్ళి అంతలోనే జరిగిపోయింది. రవి అంటున్నట్లే స్వప్న! ... తన చిన్నారి స్వప్న! సముద్రాలు దాటి ఖండాంతరాలు వెళ్ళిపోయింది. ఇదేమిటిలా?

ఆ తియ్యని గొంతు విన్పించక ఈ పరిసరాలన్నీ మూగబోయాయి. సందీప్ అయితే పూర్తిగా అంతర్ముఖుడైపోయాడు. టి.వి. ముందు, కంప్యూటర్ ముందు వాళ్ళ ఆర్గ్యుమెంట్లు, డైనింగ్ టేబిల్ దగ్గర తనని కూడా వాళ్ళు అల్లరిలోకి లాగే ప్రయత్నం, ఇంట్లో ఏ పక్కన చూసినా వాళ్ళముఖాలే, వాళ్ళ నవ్వులే. ఇంతలోనే ఎటు వెళ్ళిపోయారు ఇద్దరూ, అవును తను కోరుకునే ఒంటరితనాన్ని, తను అనునిత్యం ఆరాటపడే ప్రైవసీని తనకోసం వదిలి వెళ్ళిపోయారు.

ఏం మిగుల్చుకుంది? ఇదేమిటి, జీవితం ఘనీభవించినట్లు?! రవి మాత్రం మామూలుగానే ఉన్నట్లు కన్పడుతున్నాడు. ఈ మధ్యలో 5, 6 వారాలు ఆఫీసు పనిమీద బొంబాయి వెళ్ళివచ్చాడు. వచ్చాక మరింత బిజీ.

అతని మనసులో ఏముందో తనదగ్గర బయటపడలేదు. ఆమధ్య అతని స్నేహితుడెవరో వస్తే చెబుతున్నాడు "స్వప్న పెళ్ళై వెళ్ళిపోవడం, సందీప్ స్టడీస్ పేరుతో చెన్నై వెళ్ళిపోవడం కాస్త వెలితిగానే ఉందిరా, హరీ. కాని బాధ్యతనంతా భుజాలమీద వేసుకున్న క్రెడిట్ మాత్రం సునీతదే. వాళ్ళకోసం తన సర్వశక్తులూ వినియోగించింది. నాదేం లేదురా నిజం చెప్పాలంటే."


అతని గొంతులో సంతృప్తి స్పష్టంగా వింది తను. రవికి ఏమీ అన్పించడంలేదా? బాధ్యతలు తీర్చేసుకుంటే అయిపోయిందా? ఈ మనసు నంటి పెట్టుకున్న మమకారాలు తీరేదెలా?

తనకి మాత్రం జీవితం మరొక్కసారి మొదలవుతే బావుణ్ణని ఉంది. తన చిన్నారుల బాల్యం, ఆటలు, అల్లరి అన్నీ తనివితీరా తనూ వాళ్ళలో ఒకటిగా కల్సిపోయి అనుభవించాలన్న తపన. ఎలా? ఎలా?

అనుకున్న దానికంటే ముందుగానే వచ్చేశాడు రవి. "సునీ! భోజనం చేశావా?"

పదకొండు దాటింది. పరిసరాలన్నీ నిశ్శబ్దంగా ఉన్నాయి. ఎక్కడో దూరంగా టి.వి. కాబోలు, వాల్యూమ్ ఎక్కువగా పెట్టినట్లున్నారు.

స్తబ్దుగా కూర్చున్న భార్యని చూసి కుర్చీ లాక్కొని తనూ అక్కడే కూర్చుండిపోయాడు.



"ఏరా! నీ సన్నజాజితో కబుర్లు చెప్పుకుంటున్నావా? నిద్రరావడంలేదూ" ఆ జాజితీగెతో సునీత అనుబంధం అతనికి తెల్సున్నదే.

"రవీ! నాకు పిల్లలు కావాలి" గొంతు ఎక్కడో అగాథం లోంచి. "అమ్మో, ఇప్పుడా? పెద్దప్రోగ్రామ్ పెట్టావే" చిలిపిగా ఆటపట్టిస్తున్న అతనితో సీరియస్‌గా అంది. "రవీ! స్వప్న దూరంగా వెళ్ళిపోయింది. సందీప్ చదువుకోసం వెళ్ళిపోయాడు. ఆతర్వాత ఎటో, ఎక్కడుంటాడో! ఈ నిశ్శబ్దంలో ఎన్నాళ్ళు? ఎన్నేళ్ళు ఇలా..."

ఆమె తల్లి మనసు అర్థం అవుతోంది. "నేనున్నాను కదరా సునీ" లాలనగా అన్నాడు.

"నేనిలా ఉండలేను రవీ. ఏం ఉంది ఇక జీవితంలో" కంఠం రుద్ధం అవుతోంది. "అదేం మాట సునీ!? అలా బాధపడితే ఎలా? నువ్వు మాత్రం నీ పేరెంట్స్‌ని విడిచి రాలేదూ? అప్పుడెంత చిన్నపిల్లవి! జ్ఞాపకం లేదూ? "అమ్మా" అంటూ కన్నీరు పెట్టుకునేదానివి". ఆమె మనసు తేలికచేసే ప్రయత్నంలో నవ్వేశాడు.

"రవీ! నన్నర్థం చేసుకో. నా బాధ నీకెలా చెప్పను?" ఆపుకోలేక ఒక్కసారి బరెస్ట్ అయింది. అతని మనసూ అంత బేలగానూ ఉంది. ఓదార్పుగా ఆమె చేతులందుకున్నాడు. లాభం లేదు. ఈ పిల్ల డిప్రెషన్‌లోకి వెళ్తోంది. "సునీ! పిల్లలిద్దర్నీ పెంచి పెద్దచేసి వాళ్ళు దూరంగా వెళ్ళారని గోల చేస్తున్నావు. ఒక్కసారి నీ ఈ సన్నజాజి నేస్తాన్ని చూడు.

ఈ తీగె ఎన్నిసార్లు చిగుళ్ళు వేసింది, ఎన్నిసార్లు మొగ్గల్ని సృష్టించింది! ఎన్నెన్ని పరిమళాల్ని పంచింది. అంతలోనే మోడువారి, ఎండిన రెమ్మల్ని విదిల్చి జీవనోత్సాహంతో మళ్ళీ మళ్ళీ చిగుళ్ళు వెయ్యడం లేదూ?!

ఆ తీగెనంటి ప్రవహిస్తున్న జీవనగీతాన్ని, ఆ తియ్యని ఆలాపనని నువ్వు వినడం లేదూ? ఇన్నేళ్ళుగా అది అందిస్తున్న అద్భుతమైన సందేశాన్ని నువ్వు అందుకోనేలేదూ? సునీ! స్వప్న, సందీప్‌లు నీ పిల్లలు, అపురూపంగా పెంచుకున్నావ్. చక్కని భవిష్యత్తు నిచ్చి, ప్రపంచంలోకి మంచి పౌరులుగా పంపావు. వాళ్ళెక్కడున్నా నీ వాళ్ళు. లత పాడినట్లు "తూజహాఁ జహాఁ చలేగా, మేరాసాయా..." అంటూ నీడలా వాళ్ళని నీమమకారం అంటి పెట్టుకునే ఉంటుంది.

నీ కెందుకంత దిగులు? అసలు చెప్పడం మర్చిపోయాను. నీ పిల్లలిద్దరూ నీకు పెద్ద మెయిల్ పంపారు. ఈ నాన్న ప్రస్తావనేలేదు. స్వప్న రాసింది కదా "అమ్మా నేవేసే ప్రతీ అడుగులోనూ, నా ప్రతి ఆలోచనలోనూ నీ ప్రభావం ఉందమ్మా. ఇంత చక్కని జీవితాన్నిచ్చిన నీకేం ఇవ్వను" అంటూ చాలా రాసింది. రా, నువ్వే చూస్కో నీకళ్ళతో. నే చెప్పలేదా సునీ, వాళ్ళు నీ పిల్లలు. నే నొట్టి ఆవారాని" జాలి జాలిగా ముఖం పెట్టి ఆమెతోపాటు ఇంట్లోకి నడిచాడు రవి. ■

### *వేరుసెనగలతో టీబీ దూరం!*

*నేటి లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇరవై లక్షల మంది టీబీ రోగులున్నారని అంచనా. మునుపు మందులు కనిపెట్టలేదు కనుక అది ప్రాణాంతకరోగ మనుకున్నారు కానీ. ఇప్పుడు అది పెద్ద జబ్బేమీ కాదంటున్నారు. స్వీడన్‌లోని లింకోపిన్ యూనివర్సిటీ వారి ఇటీవలి పరిశోధనలు తేల్చిన సంగ తేమిటంటే, వేరుసెనగలు తీసుకోవటం వల్ల టీబీ తగ్గుతుందని. వేరుసెనగల్లో వుండే 'ఆర్జినైన్' అనే ప్రత్యేకరసాయనం. శరీరంలో ఉత్పత్తి అయ్యే నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిని పెంచుతుంది. ఇది టీబీని నిర్మూలించే శక్తి గల ఆక్సైడు. టీబీ రోగులకు మందులతో పాటు ఆర్జినైన్ రసాయనం గల మందులు కూడా ఇచ్చిపరిశీలిస్తే వారి ఉమ్మిలో టీబీ క్రిముల సంఖ్య బాగా తగ్గిందట. అలవాటు లేని వారు సైతం వేరుసెనగలు తినే పని ప్రారంభించాలి మరి!* *ఎన్.*